క్లుప్తంగా

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఏఓ అంజనేయులు

కంబదూరు: సచివాలయ సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని మండల పరిషత్ పరిపాలన అధికారి ఆంజనేయులు హెచ్చరించారు. బుధవారం కంబదూరులోని 1, 2, 3, 4 సచివాలయాల పరిధిలోని సచివాలయ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. రోజుకు మూడు సార్లు తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని సూచించారు. బయోమెట్రిక్ వేయకుంటే జీతం కట్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల నిరసన



పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న వార్డు సభ్యులు

ఉరవకొండ: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పలువురు వార్డు సభ్యులు నిరసన తెలిపారు. సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్‌సాహెబ్ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో అజెండాలో పొందుపరిచిన అంశాలపై చర్చ నిర్వహించారు. ఈసందర్భంగా గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా రథానికి పూలమాల ఇతర ఖర్చులకు రూ4.30 లక్షలు ఖర్చు ఎక్కడ పెట్టారని ప్రశ్నించారు. దీనిపై ఈఓ గౌస్‌సాహెబ్ ఆధారాలతో సహ వివరించడానికి ప్రయత్నిస్తుండగా దీన్ని వార్డు సభ్యులు అడ్డుకున్నారు. అనంతరం సమావేశం నుంచి బయటకు వచ్చి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్, రామాంజనేయులు, చేజాల ప్రభాకర్ మాట్లాడుతూ పంచాయతీ నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు పెట్టి దానికి సరైన ఆధారాలు చూపకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తో పాటు డీపీఓలకు ఫిర్యాదు చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

బ్రహ్మసముద్రం: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ జి.పూజ, జెడ్పీటీసీ ప్రభావతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యలను గ్రామస్తులు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ, మురుగు నీరు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో కోతిగుట్ట సమీపంలో ఇళ్ల మధ్యలోనే ఓ పాడుబడ్డ బావి ప్రమాదకరంగా ఉందని తెలిపారు. చిన్నారులు ఆడుకుంటూ అందులో పడిపోయే అవకాశం ఉందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బావిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంజుళ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరీష్, ఏఎన్‌ఎం నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

బెళుగుప్ప: వెంకటాద్రిపల్లిలోని రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ బుధవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన లబ్ధిదారులతో పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. స్టాకును పరిశీలించారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందాలి



కౌలురైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శుభకర్

ఉరవకొండ: కౌలు రైతులు గ్రామ రెవెన్యూ అధికారులతో కలిసి మీ వివరాలు అందించి గుర్తింపు కార్డు పొందాలని ఏఓ శుభకర్ సూచించారు. బుధవారం మోపిడి, ఆమిద్యాల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతులతో ఏఓ సమావేశం నిర్వహించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డును పొందాలని అప్పుడే వారు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతారన్నారు. దీంతో పాటు వారు సాగు చేసిన పంట నమోదు వివరాలను కుడా ఆన్‌లైన్‌లో పొందుపరిచే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థుతుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల వైపు కౌలు రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు.

విద్యుత్ కనెక్షన్ల కోసం నిరీక్షణ



ఇక్కడ కనిపిస్తున్న రైతు పేరు కురబ తిమ్మప్ప. కళ్యాణదుర్గం మండలం విట్లంపల్లి గ్రామం. బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లి గ్రామంలో ఇతడికి 3 ఎకరాల పొలం ఉంది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.37 వేలు డీడీ చెల్లించాడు. అయితే ఇప్పటివరకు సదరు రైతుకు కేవలం ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే ఇచ్చారు. మిగిలిన ఏ చిన్న బోల్టు కూడా ఇవ్వలేదు. ఇదేమని అడిగితే మీ ఎస్టిమేషన్ నంబర్‌కు పరికరాలు రాలేదని బ్రహ్మసముద్రం విద్యుత్ శాఖ ఏఈ చెబుతున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇలా కళ్యాణదుర్గం డివిజన్‌లో వందలాది మంది రైతులకు పరికరాలు ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు.

- పెండింగ్‌లో వేలాది దరఖాస్తులు
- అరకొరగా మెటీరియల్ ఇస్తూ కాలయాపన
- వర్షాభావంతో బోరుబావుల వైపు రైతన్నల చూపు
- కనికరించని విద్యుత్ శాఖ అధికారులు



కళ్యాణదుర్గంలోని విద్యుత్ డివిజనల్ కార్యాలయం

కళ్యాణదుర్గం: విద్యుత్ వ్యవసాయ సర్వీస్ కనెక్షన్ల కోసం రైతన్నలు నిరీక్షిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. దరఖాస్తులను తీసుకోవడం.. వాటిని కార్యాలయాలకు పరిమితం చేయడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల్లో బోరు బావులతో జీవనం సాగిద్దామని అనుకుంటున్న రైతన్నల ఆశలు అడియాశలు అవుతున్నాయి.

పెండింగ్‌లో వేలాది దరఖాస్తులు

కళ్యాణదుర్గం డివిజన్‌లో కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల నుంచి ఇప్పటివరకు సుమారు 27,404 దరఖాస్తులు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం వచ్చాయి. వచ్చిన దరఖాస్తులన్నింటినీ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇప్పటివరకు 9,773 దరఖాస్తులను మాత్రమే విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేశారు. మిగిలిన 12,709 దరఖాస్తులు నగదు చెల్లించని కారణంగా పెండింగ్‌లో ఉంచారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతన్నలు బోరు బావులపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. ఈసారి నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ పంటల సాగుకు రైతన్నలు దూరం అయ్యారు. ఫలితంగా బోరుబావులపై ఆధారపడి పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో విద్యుత్ సర్వీస్ కనెక్షన్లకు డిమాండ్ పెరిగింది.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు..

విద్యుత్ కొత్త సర్వీసు కనెక్షన్ కోసం రైతన్నలు ఆయా నియోజకవర్గాల్లోని విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. డీడీ నగదు చెల్లించినా విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో రైతన్నలు దిగాలు చెందుతున్నారు. దీనికి తోడు కొన్ని మండలాల్లో కొందరు ఏడీ, ఏఈ స్థాయి అధికారులు సైతం ముడుపులు లేనిదే దరఖాస్తులను అనుమతించరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అరకొరగా పరికరాల పంపిణీ

పూర్తిస్థాయిలో డీడీ చెల్లించిన రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు కరెంటు స్తంభాలు, వైరు, జంపర్లు తదితర వాటిని వెంటనే అందించాల్సి ఉంది. అయితే స్థానిక విద్యుత్ ఏడీ, ఏఈలు ఒక్కో రైతుకు ఒక్కొక్కటి ఇచ్చి అరకొర పరికరాలతో అందజేస్తూ కాలయాపన చేస్తున్నారు. తమ ఇండెంట్‌లో వచ్చిన మెటీరియల్ ఇవ్వలేదని అడిగితే వచ్చింది తీసుకెళ్లండంటూ అధికారులు ఉచిత సలహాలివ్వడం గమనార్హం..

కళ్యాణదుర్గం డివిజన్‌లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల వివరాలు..

వచ్చిన దరఖాస్తులు	27,404
రిజిస్టర్ చేసినవి	27,404
మంజూరు చేసినవి	9,773
నగదు చెల్లించకుండా పెండింగ్‌లో ఉన్నవి	12,709

ఇప్పటి వరకు ఇవ్వలేదు



విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.18,640 సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఏపీ పేరిట డీడీ తీశాను. ఇప్పటి వరకు చాలా సార్లు విద్యుత్ అధికారుల వద్దకు వెళ్లినా ఫలితం లేదు. ఎందుకు ఆలస్యమని అడిగితే తనకంటే ముందుగా డీడీ కట్టిన వారికి ఇచ్చాక ఇస్తామని చెబుతున్నారు. నాతో పాటు కట్టిన వారికి కూడా ఇచ్చారు. ఇది పంటలు సాగు చేసే సమయం. అధికారులు స్పందించి వెంటనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలి.

– పెద్ద నల్లప్ప, రైతు, ముప్పులకుంట

శిక్షా సప్తాహ్.. విద్యార్థులకు ఉపయోగం



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

బొమ్మనహాళ్: శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఉత్తమ విద్యార్థులుగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈఓ మల్లికార్జున అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం గోవిందవాడ హైస్కూల్‌లో కబడ్డీ, ఖోఖో తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభ సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

మొక్కలే ప్రాణాధారం



లక్ష్మంపల్లిలో మొక్కలు నాటుతున్న డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ దీప

సెట్టూరు: మొక్కలే జీవ ప్రపంచానికి ప్రాణాధారమని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ దీప అన్నారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మంపల్లి ఉన్నత పాఠశాలలో 'తల్లి పేరున ఒక మొక్క నాటుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో 125 మొక్కలు నాటి నీరు పోశారు. విద్యార్థులు తప్పనిసరిగా తల్లి పేరున మొక్కను నాటి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు పొలం బాట పట్టాలి



రాయదుర్గం ఆర్బీకేలో మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

రాయదుర్గం: మండల వ్యవసాయాధికారులు సిబ్బందితో కలసి పొలం బాట పట్టాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న రైతు సేవా కేంద్రంలో బుధవారం ఏడీఏ లక్ష్మానాయక్ అధ్యక్షతన రాయదుర్గం, గుమ్మఘట్ట, డి హీరేహాళ్ మండలాల ఏఓల ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఏఓ మాట్లాడుతూ లోటు వర్షపాతం నమోదుతో ఖరీఫ్ ముందుకు సాగు లేదని, అధికారులు రైతులతో మాట్లాడి వారి కష్ట సుఖాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగు చేసుకోవాల్సిన పంటలపై అవగాహన కల్పించాలన్నారు. భూసార పరీక్షలపై రైతుల్లో మరింత చైతన్యం తెద్దామన్నారు. సీసీఆర్సీ (కౌలు రైతుల) కార్డుల రెన్యూవల్, పీఎం కిసాన్ అమలులో నెలకొన్న సమస్యలపై చర్చించారు. పొలంబడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆరా తీశారు. పొడి తేమలోనే విత్తనాలు వేసుకోవడం మంచిదికాదనే విషయం రైతులకు తెలియజేయాలన్నారు. ఆగస్టు 10 వరకు వేరుశనగ విత్తుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు నిర్మల్‌కుమార్, క్రిష్ణకిషాన్ రెడ్డి, సాయికుమార్, ఇతర ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కణేకల్లు లో కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల సిబ్బందితోనూ పై విధంగా సమావేశం నిర్వహించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కళ్యాణదుర్గం రూరల్: వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ రాధా కుమారి సూచించారు. బుధవారం వేరుశనగ పంటలో రైతు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నూనె గింజల్లో వేరుశనగ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. వేరుశనగకు మొదలు కుళ్లు తెగులు సోకుతుందన్నారు. కాయలపై శిలింద్రం ఆశించి నల్లని మచ్చల్ని వ్యాపింప చేస్తాయని తెలిపారు. ఈ తెగుళ్ల నివారణకు రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడి ఫార్ములేషన్‌ను 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండిని కలిపి 15 రోజుల వరకు గోనిసంచలతో నీడ కప్పి నీడలో మాగపెట్టి వేరుశగన విత్తిన వెంటనే 30, 60 రోజుల్లో మట్టిలో చల్లాలన్నారు. అధిక తెగుళ్లను గమనించినప్పుడు హెక్సాకోనజోల్ 5ఎస్‌సి 400 మి.లీలు పిచికారీ చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటపై మరింత సమాచారం కోసం కళ్యాణదుర్గం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సంప్రదించాలన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి



ఆర్డీఓ రాణిసుస్మితకు వినతపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాణిసుస్మితను కలిసి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, జిల్లా కమిటి సభ్యుడు అరవింద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి జూనియర్ కళాశాలకు వచ్చే విద్యార్థులు మధ్యాహ్నం భోజనం కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోజు డబ్బులు ఖర్చు పెట్టి భోజనం చేసే పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమలు చేయాలని కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ ఎన్నిక

పట్టణంలో బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ధనుష్, సహాయ కార్యదర్శిగా రాకేష్, హరికృష్ణ, ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరు కావాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏడీ నాగరాజు

కణేకల్లు: ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కావాలని జిల్లా మోడల్ స్కూల్ ఏడీ నాగరాజు సూచించారు. బుధవారం ఆయన కణేకల్లు మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరుపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని సూచించారు. మోడల్ స్కూల్‌కు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బసవరాజును నియమించినట్లు తెలిపారు. ఇకపై ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వర్తిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాలు తప్పక నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా క్రీడా దినోత్సవం నిర్వహించాల్సి ఉండటంతో షటిల్ ఆటలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆకలిబాధలు తీర్చాలి



ధర్నా చేస్తున్న నాయకులు

రాయదుర్గం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పునరుద్ధరించి విద్యార్థుల ఆకలి బాధలు తీర్చాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంతరాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి కలుగోడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. పట్టణంలో వందలాది మంది విద్యార్థులతో కలసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న అనేక సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉండే మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పక్కా వసతి గృహాలు నిర్మించాలన్నారు. మెనూకు తగ్గట్టుగా మెస్ చార్జీలు పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. అద్దె వసతి భవనాల్లో సౌకర్యాలు పూర్తిగా కొరవడ్డాయన్నారు. నవంబర్ నుంచి ప్రస్తుత నెల వరకు కాస్మోటిక్ చార్జీల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారన్నారు. హాస్టల్ ట్యూటర్లకు వేతనాలు చెల్లించాలన్నారు. ఈ ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని విస్తృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ చిట్టిబాబుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అభిషేక్, కార్తీక్, అభి, విజయేంద్ర, భరత్, మనోజ్, మహేంద్ర, విఠల్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



శిక్షా సప్తాహ్‌లో పాల్గొన్న సర్పంచ్ మోనాలిసా

వజ్రకరూరు: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వజ్రకరూరు సర్పంచు మోనాలిసా సూచించారు.బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జాతీయవిద్యావిధానం (2020) ఏర్పాటు చేసిన నాలుగేళ్ల పూర్తయినన సందర్భంగా వార్షికోత్సవం, శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు స్థానిక వనరులతో తయారు చేసిన బోధన అభ్యసనా సామగ్రిని ప్రదర్శించారు. అనంతరం సర్పంచు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూరాణించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రంగప్రసాద్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. వారంరోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనుంజయ, అశోక్‌కుమార్, కౌసల్య, అరుణకుమారి, భాగ్యరేఖ, శ్రీనివాస్‌రావు, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కూడేరు: కూడేరు, ఉదిరిపికొండ, మరుట్ల, తిమ్మాపురం రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్షాభావంతో ఎండుముఖం పట్టిన వేరుశనగ, కంది, ఆముదం పంటలను మండల వ్యవసాయాధికారి విజయకుమార్ బుధవారం పరిశీలించారు. ఎకరా పంటకు 200 లీటర్ల నీటికి 2 కేజీల 19:19:19 కాంప్లెక్స్ ఎరువును బాగా కలిపి మొక్కలు తడిచేలా వారానికి రెండు సార్లు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఆయా పంటలకు సోకే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది జయ ప్రకాష్, నారాయణమ్మ, రాజ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌లో హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన, జైనాబీ బుధవారం కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే నిర్వహించారు. కుష్టు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి, తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: అనాథ మృతదేహనికి ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు..మతిస్థిమితం లేని 18 ఏళ్ల వ్యక్తి గత కొన్ని నెలలుగా స్థానిక గవిమఠం వద్ద ఉంటున్నాడు. అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందాడు. ఎవరూ లేకపోవడంతో ఆపద్బాంధవ ట్రస్టు వ్యవస్థాపకులు మురళీ, సభ్యులు నూర్, భీమేష్, బాషా, అశోక్, రమేష్, నవీన్‌తో పాటు హెడ్‌కానిస్టేబుల్ జయకుమార్, సోమశేఖర్ తదితరులు అనాథ మృతదేహన్ని వెలిగొండ రోడ్డులోని శ్మశాన వాటికకు తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న ఆర్డీఓ రాణిసుస్మిత

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఆర్డీఓ రాణి సుస్మిత సూచించారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాణి సుస్మిత, సీఐ హరినాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదవుపై దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాలతో జీవనం నాశనం అవుతుందన్నారు. సమాజంలో గౌరవం ఉండదని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలంటే చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం అని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేష్ బాబు పాల్గొన్నారు.

గొంతు వాపు వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు



గౌటుకూరులో టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

కూడేరు: గేదెలకు వచ్చే గొంతు వాపు వ్యాధిని పశు పోషకులు నిర్లక్ష్యం చేయొద్దని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు సూచించారు. బుధవారం గౌటుకూరు గ్రామంలో పశు వైద్యాధికారులు గేదెలకు గొంతు వాపు వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గొంతు వాపు వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుందని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కాగలదని పశువైద్యాధికారి తెలియజేశారు. ఈ వ్యాధి వర్షా కాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దోమల నివారణపై ప్రజలకు సూచనలిస్తున్న అధికారులు

విడపనకల్లు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ జయకుమార్ నాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి సూచించారు. మండల పరిధలోని కేంద్రంలో పెద్ద కొట్టాలపల్లిలో బుధవారం వారు ఇంటింటా తిరుగుతూ డ్రై డేపై అవగాహన కల్పించారు. మురుగుకాలువలో వేస్టు ఆయిల్‌ను చల్లించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పాల్తూరు ఆరోగ్య సిబ్బంది తిరుపాల్ నాయక్, ఆశా,అంగన్‌వాడీ, ఆరోగ్య వర్కర్లు పాల్గొన్నారు.